

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి కరీంనగర్ జిల్లా

సోమవారం 14 సెప్టెంబర్ 2026 పేజీలు : 10


## త్వరలోనే దళిత బంధు నిధులు విడుదల ప్రక్రియ ప్రారంభిస్తాం

- దళితులకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ..
- దళితుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టాం.
- దళిత స్పీకర్ పై మాటలు,శుద్ధిపేరుతో బీఆర్ఎస్ చేస్తున్న రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారు.
- జమ్మికుంట పట్టణంలో కీలక ప్రకటన చేసిన హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్..



**జమ్మికుంట సెప్టెంబర్13( విజన్ ఆంధ్ర)**

దళితబంధు పథకం విషయంలో ఇక్కడ ఇంచార్జిగా ప్రణవ్ మంత్రులను,ఇంచార్జి మంత్రులను కలిసి నిధులు విడుదల అయ్యేందుకు కృషి చేస్తున్నాడని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు.ఆదివారం నాడు జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్స్ లో మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ దళిత జాతి అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిత్యం కృషి చేస్తుందని,ఎస్సీ వర్గీకరణ కోసం ఏ పార్టీ చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేసి చూపెట్టారని అన్నారు ఈ ప్రకటనతో దళిత బంధు లబ్ధిదారుల్లో సంతోషం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ నిర్వాహకులు,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ.....

**మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన పొత్కపల్లి ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి....**

**ఓదెల సెప్టెంబర్ 13,(విజన్ ఆంధ్ర)**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో ఆదివారం వినాయక చవితి సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ కార్యదర్శి భీష్మాచారి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి,ఓదెల మాజీ సర్పంచ్ మహేందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీష్మాచారి మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర,అవయవ,శరీర ధానాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేస్తూ గత కొన్ని సంవత్సరాలుగా సమాజ హితాన్ని కోరుతున్నామన్నారు.అందులో భాగంగా సెప్టెంబర్ 14 వ తేదీ న ప్రారంభం కానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఓదెల మండల కేంద్రంలో ఉచిత మట్టి వినాయకులను పంపిణీ చేశామన్నారు.మండలంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాల కు బదులు మట్టి వినాయకులను సాధ్యమైనంత ఎత్తు తగ్గించి వాడాలన్నారు.ప్లాస్టిక్ గ్లాసులు,బాటిల్స్ బదులు స్టీలు గ్లాసులు వాడడం,ప్లాస్టిక్ కోటెడ్ విస్తార్ల కు బదులు అరటి,మోదుగు ఆకు విస్తార్లు,స్టీలు ప్లేట్లు వాడడం,డీజే సౌండ్స్, బాణాసంచా నివారిస్తూ,తక్కువ ధ్వనితో భజనలు చేయడం,భక్తులు పూజా సామగ్రి తెచ్చే ప్లాస్టిక్ కవర్లు వాడకుండా,స్టీలు,వెదురు బుట్టలు వాడుతూ మండపాల నిర్వహణ పర్యావరణ హితంగా ఉండేలా నిర్వహణ చేపట్టాలన్నారు.అన్ని రకాలుగా పరిశుభ్రత పాటిస్తున్న మండపాల నిర్వాహకులకు సదాశయ ఫౌండేషన్ ద్వారా అతిథులచే సత్కరించి ప్రోత్సహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఓదెల మండలం ప్రతినిధులు క్యాతం మల్లేశం,వేణు,క్యాతం వెంకటేశ్వర్లు,వెంకటేశ్వర్లు,అల్లం సతీష్,మేరుగు సారంగం,సంతోష్,తుమ్మ మధుకర్,నవీన్, కానుగంటి శంకరయ్య,బ్రాహ్మణపెల్లి రవీంద్ర చారి దేవకి పాల్గొన్నారు.



## గుంతలమయంగా.... రైల్వే బ్రిడ్జి రోడ్డు!

**తేలిన ఇనుపచువ్వలు.. ప్రమాదం అంచున వాహనదారులు**

**తాత్కాలిక మరమ్మతులు మళ్లీ దెబ్బతిన్నా పట్టించుకోని అధికారులు**

**నాసిరకం పనులపై ప్రశ్నలు.. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?**



**మెట్‌పల్లి డివిజన్ సెప్టెంబర్ 13 (విజన్‌ఆంధ్ర)**

మెట్‌పల్లి పట్టణంలోని రైల్వే బ్రిడ్జి కింద రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గతంలో భారీ గుంతలతో నరకప్రాయంగా మారిన ఈ రహదారికి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డు వేశారు. అయితే భారీ వాహనాల రాకపోకలతో కొద్దికాలానికే ఆ పనుల నాణ్యత బట్టబయలైంది. కాంక్రీట్ రోడ్డు పలుచోట్ల దెబ్బతిని సిమెంట్, కంకర తేలిపోయాయి. దీంతో రహదారి మళ్లీ గుంతలమయంగా మారింది. అంతేకాకుండా కొన్ని చోట్ల ఇనుపచువ్వలు బయటకు తేలి కనిపిస్తుండటం వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులకు ఇవి తీవ్ర ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళ గుంతలు, ఇనుపచువ్వలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదం మరింత పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.

**తాత్కాలిక పనులతో ప్రయోజనం ఏంటి?**

ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన రోడ్డు పనులు కొద్దికాలానికే దెబ్బతినడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, తాత్కాలిక మరమ్మతులతో సమస్యను పక్కదారి పట్టించడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాధనంతో చేపట్టిన పనులు కొద్దిరోజులకే దెబ్బతింటే ఆ నష్టం ఎవరి బాధ్యత అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?**

రోడ్డు పరిస్థితి ప్రమాదకరంగా మారినా అధికారులు స్పందించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాసిరకం పనులతో మూడు నాలుగు నెలలకే రోడ్డు గుంతలమయమైతే.. ప్రజల ప్రాణాలకు విలువ లేదా? ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన తర్వాతే అధికారులు మేల్కొంటారా? అని స్థానికులు నిలదీస్తున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

రైల్వే బ్రిడ్జి కింద రహదారిని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, బయటకు తేలిన ఇనుపచువ్వలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. గుంతలను తాత్కాలికంగా పూడ్చడం కాకుండా నాణ్యతా ప్రమాణాలతో రహదారిని శాశ్వతంగా పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో చేపట్టిన కాంక్రీట్ పనుల నాణ్యతను కూడా పరిశీలించి, లోపాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం, పరామర్శల కంటే.. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవడమే అధికారుల బాధ్యత.

## రోడ్డుపై పందుల స్వైర విహారం

**పట్టించుకోని అధికారులు.. ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**జమ్మికుంట: సెప్టెంబర్ 13 ( విజన్ ఆంధ్ర).**

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పందులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల పక్కన ఖాళీ స్థలాలు, మురుగు కాలువల సమీపంలో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంటోంది.ప్రధాన రహదారుల వెంటనే పందులు సంచరించడంతో వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పందుల సంచారం వల్ల దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పందుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, పట్టణంలోని ఖాళీ ప్రదేశాలు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.



# మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## శాంతి భద్రతల మధ్య వినాయక చవితిని నిర్వహించుకుందాం
## -- ఎస్సై నవీన్ కుమార్, ఇబ్రహీంపట్నం




**మెట్‌పల్లి డివిజన్, సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరూ ˇర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్ సూచించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వహించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని ఎస్సై కోరారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించినవారవుతారని తెలిపారు. రసాయన రంగులు, కాలుష్యకారక పదార్థాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

వినాయక మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తుగా అవసరమైన అనుమతులు, ఆన్‌లైన్‌లో చేయాల్సిన నమోదు/దరఖాస్తు ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఎస్సై నవీన్ కుమార్ సూచించారు. సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందిన అనంతరమే మహోత్సవాలను నిర్వహించుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

**శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలి**

మండపాల వద్ద శబ్ద కాలుష్యానికి కారణమయ్యే అధిక శబ్దంతో లౌడ్‌స్పీకర్లు, డీజేలు నిర్వహించకుండా సంబంధిత నిబంధనలను పాటించాలని ఎస్సై సూచించారు. రాత్రి వేళల్లో ప్రజలకు, వృద్ధులకు, చిన్నారులకు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాకపోకలకు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వినాయక చవితి వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై నవీన్ కుమార్ కోరారు. భక్తి, ఆనందం, సోదరభావంతో పండుగను నిర్వహించుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

శాంతి భద్రతలను కాపాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ వినాయక చవితి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసు శాఖకు సహకరించాలని, ప్రశాంత వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎస్సై నవీన్ కుమార్ ఆకాంక్షించారు.

## గణేష్ మండపాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి!

**కొత్తపల్లి, సెప్టెంబరు 13 విజన్ ఆంధ్ర :**




కరీంనగర్ 20వ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల వద్ద మున్సిపల్ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని బీఆర్ఎస్ మైనారిటీ కార్యకర్త ఎండీ సైఫ్ కోరారు. రేకుర్తి స్వామి కాలనీలో హైమాస్ట్ లైట్లు పనిచేయడం లేదని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టి, విద్యుత్ భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి పాయింట్ వద్ద డస్ట్ వేయడంతో పాటు పారిశుధ్య ఏర్పాట్లు మెరుగుపరచాలని సూచించారు. అదేవిధంగా డివిజన్‌లోని పలు కాలనీల్లో కుక్కలు, పందులు, దోమల బెడద అధికంగా ఉందని తెలిపారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందన్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని ఎండీ సైఫ్ కోరారు.

## ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్స్ట్రక్టర్, ఆయాల జీతాలు చెల్లించాలి

### - న్యాయమైన డిమాండ్ లు పరిష్కరించాలి

**కరీంనగర్, సెప్టెంబర్ 13 విజన్ ఆంధ్ర**




గత మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్స్ట్రక్టర్ లు, ఆయాల జీతాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయాల యూనియన్ రాష్ట్ర న్యాయ సలహాదారు జక్కనపల్లి గణేష్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ ఎం.లక్ష్మణ్ లు డిమాండ్ చేసారు. పట్టణంలోని స్నేహ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ లో జరిగిన యూనియన్ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఇన్స్ట్రక్టర్, ఆయాలలకు పని సమయాన్ని తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. వర్కర్ లకు ఎంప్లాయ్ స్టేట్ ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రస్తుత వేతనాలు తక్కువగా ఉన్నాయని, కనీస వేతన చట్టం ప్రకారం జీతాలను సవరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అడ్హాక్ కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ గా సుమయా సధాఫ్, కో కన్వీనర్ లుగా గుండ మమత, ఇటికాల ధనూజ, జవ్వాజి శ్రావ్య, బర్రె మౌనిక, దొంత అనిత, మేడి మౌనిక, అడప భాగ్యలక్ష్మి, జాయింట్ కన్వీనర్ లుగా ఈదురు పద్మ, అక్కల మౌనిక, ఐతం మమత, పారిపల్లి శ్రీలత లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ పాఠశాలల వర్కర్ లు కే.శ్యామల, పీ.కవిత, బీ.రవళి, మౌనిక, మమత, శిరీష, అనిత, సౌజన్య, రజిత, లత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాజన్న సిరిసిల్ల జిల్లా జాయింట్ సెక్రటరీగా మారవేని మహేష్



**వేములవాడ సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర)**

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా సంస్థ రాజన్న సిరిసిల్ల జిల్లా జాయింట్ సెక్రటరీగా మారవేని మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ తరఫున ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మారవేని మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్మన్ మొహమ్మద్ తఖ్దీర్ అలీ, జాతీయ వర్కింగ్ ఛైర్మన్ మ్యాకల పరశురాములు, జాతీయ కార్యవర్గ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, చట్టబద్ధమైన సహాయం అందించేందుకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సంస్థ ఆశయాలకు అనుగుణంగా తన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు. సమాజ హితం కోసం సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ, మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధి, ఉన్నతికి కృషి చేస్తానని మారవేని మహేష్ పేర్కొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా తోట లహరి.

**వేములవాడ సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర )**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ ఌ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తోట లహరి, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, మరియు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ ఌ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ , కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. "నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేస్తాను. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను" అని తోట లహరి తెలిపారు.

## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**కరీంనగర్, సెప్టెంబర్ 13 విజన్ ఆంధ్ర**



పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కొల్లూరు హరిప్రసాద్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ విగ్రహం వద్ద ఆదివారం ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పిఓపి విగ్రహాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల సేవే మాధవ సేవ అని చాటిచెప్పిన విఘ్నేశ్వరుని మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, తల్లిదండ్రులను దైవంగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెద్ది వెంకటరమణ, ఎల్లెంకి వైకుంఠం, కొండూరి ప్రసాద్, అల్లాడి రంగయ్య, సుధాకర్, రవి, రవీందర్, సత్యనారాయణ తదితరులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**జమ్మికుంట, సెప్టెంబర్ 13. ( విజన్ ఆంధ్ర).**

జమ్మికుంట పట్టణంలో ఆవాపో ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న వినాయక చవితిని పురస్కరించుకుని ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవడంతో చెరువులు, కుంటలు కలుషితం కాకుండా ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆవాపో సభ్యులు యాద చంద్రశేఖర్, బాదం రమేష్, మంచాల రాంబాబు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# ఐ ఎన్ టి యు సి తోనే కార్మికులకు న్యాయం



-ఫిట్ సెక్రటరీ భూమయ్య.

**కమాన్ పూర్ సెప్టెంబర్ 13. (విజన్ ఆంధ్ర )**

సింగరేణి సంస్థలో ప్రతి కార్మికునికి ఐఎన్టియుసి తోనే న్యాయం జరుగుతుంది అని ఆర్ జి టు పరిధిలోని వకీల్ పల్లె గని ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ గోపాల భూమయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం కమాన్ పూర్ లో మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షుడు జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతి కార్మికునికి న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణి సంస్థ లాభాల బాటలో నడుస్తుందని అన్నారు.ఎన్నికల ఇచ్చిన హామీలను ప్రతి సింగరేణి కార్మికునికి చేరేలా నెరవేర్చడం జరిగిందని స్పష్టం చేశారు. అలాగే మార్పిడి కోసం పోరాటం చేస్తుంది ఐఎన్టీయూసీ మాత్రమేనని అన్నారు. లాభాల వాటలో 35% ఇప్పించగల ఇప్పించిన ఘనత ఐ ఎన్ టి సి కే దక్కుతుందని అన్నారు. వారసత్వ ఉద్యోగాల కొరకు క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని అలాగే సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవడం, ప్రతి కార్మికునికి 250 గజాల ఇంటి స్థలం కొరకు పోరాటం చేయడం, 20 లక్షల వరకు వడ్డీలేని బ్యాంకు రుణం ఇప్పించడం, ప్రతి కార్మికునికి నాణ్యమైన చికిత్స కొరకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లను క్రమబద్ధీకరణం మహిళా కార్మికులకు ఉపరితల ఉద్యోగాల సౌకర్యాల కొరకు పోరాటం చేసేది ఐ ఎన్ టి సి మాత్రమే అని పేర్కొన్నారు. కార్మికుల పక్షాన ఐ ఎన్ టి సి పోరాడి పలు హక్కులను సాధించిందని పేర్కొన్నారు.

# నిబంధనలకు లోబడి గణపతి మండపాలు ఏర్పాటు చేయాలి....

## మండపాలు ఏర్పాటుకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి....

## గణేష్ ఉత్సవ కమిటీ,మండప నిర్వహకుల కు అవగాహన కల్పించిన పొత్కపల్లి ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి



**ఓదెల సెప్టెంబర్ 13,(విజన్ ఆంధ్ర)**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి పోలీస్ స్టేషన్లో ఆదివారం మండప నిర్వహకులు,ఉత్సవ కమిటీ సభ్యులతో పొత్కపల్లి ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండప నిర్వాహకులు,గణేష్ ఉత్సవం కమిటీ సభ్యులు నిబంధనలకు లోబడి మండపాల నిర్వహణ చేపట్టాలన్నారు.మండపాల ఏర్పాటుకు స్థలం అనుమతులు తప్పనిసరి అని,అనుమతి పొందిన స్థలంలోనే మండపం ఏర్పాటు చేయాలన్నారు. ప్రార్థన మందిరాల కు ఆనుకొని గానీ,వివాదాస్పద స్థలాల్లో,రహదారులకు అడ్డంగా మండపాలు వేయరాదన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు.

***విద్యుత్ ప్రమాదాల నివారణ:***

అనధికారిక విద్యుత్ అతుకులు లేకుండా నాణ్యమైన విద్యుత్ తీగల తో కనెక్షన్ పొంది, సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు పూర్తి చేయాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి మండపం వద్ద నీటితో నిండిన డ్రమ్,3 బ్యాగుల ఇసుక తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలన్నారు.

***రక్షణ,పర్యవేక్షణ:***

మండపాల వద్ద 24 గంటలు కనీసం ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని,మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

***నిషేధిత చర్యలు:***

మండపం వద్ద మద్యం సేవించడం,పేకాట, పందాలు వేయడం లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు.మండపాల వద్ద నిర్వహించే అన్ని ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 10:00 గంటలలోపు ముగించాలన్నారు.

***పరిశుభ్రత:***

అన్నదానం,ప్రసాద వితరణ అనంతరం చెత్తను వెంటనే తొలగించేలా స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

***నిమజ్జనం రోజున పాటించవలసిన నియమాలు:***

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఉత్సవాల్లో గానీ,నిమజ్జన శోభాయాత్రలో గానీ డీజే సౌండ్ సిస్టమ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడవన్నారు.నిమజ్జనం రోజున సమయపాలన పాటించి మధ్యాహ్నం 2 గంటల నాటికే వాహనాన్ని సిద్ధం చేసుకుని,సాయంత్రం 4:00 గంటల నాటికే మండపం నుంచి బయలుదేరి ప్రశాంతంగా నిమజ్జన ప్రాంతానికి చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు.

***శోభాయాత్ర భద్రత:***

విగ్రహం తరలించే వాహనాలపై చిన్న పిల్లలను ఎక్కించరాదన్నారు.మద్యం లేదా మత్తు పదార్థాలు సేవించిన వారిని శోభాయాత్రలో పాల్గొనకుండా చూడాలన్నారు.

**సామాజిక సామరస్యం:**

ఇతర మతాల ప్రార్థనా మందిరాల వద్ద వివాదాస్పద వ్యాఖ్యలు,పాటలు,నృత్యాలు చేయడం,రంగులు చల్లడం చేయరాదన్నారు.

**నిమజ్జన ప్రదేశం:**

పోలీసులు సూచించిన క్యూ పద్ధతి ప్రకారం మైక్ ద్వారా చేసే సూచనలను పాటిస్తూ క్రేన్ల వద్ద విగ్రహాలను క్రమపద్ధతిలో సురక్షితంగా నిమజ్జనం చేయాలని కోరారు.భక్తి -- భద్రత -- క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసి,పొత్కపల్లి పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి సహకరించాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల బిఎల్వోల సమావేశం

## ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు

**గంభీరావుపేట సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర)**



గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్ గారి ఆధ్వర్యంలో దత్త సాయి ఫంక్షన్ హాల్ లో టీపీసీసీ ఆదేశాల మేరకు గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు.. ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించే శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు, తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా ప్రతి ఓటరు స్వేచ్ఛగా తన నిర్ణయాన్ని తీసుకుని ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, మహిళలు, మొదటిసారి ఓటు హక్కు పొందిన వారు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని కోరారు..ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు హాజరైనారు మరియు మండల ఉపాధ్యక్షులు కిషన్ గౌడ్, జోగు సురేష్, గాండ్ల బాలలక్ష్మి, దేశెట్టి రాజశేఖర్, నాగభూషణం, ఎలా బాలకృష్ణ, బంగ్లా రాజు గౌడ్, గౌరీ శంకర్, కేకుమల్ల ప్రవీణ్, మరియు మండల పట్టణ కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల స్థాయి మహిళలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక

**కథలాపూర్, సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర):**







కథలాపూర్ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సంఘం అధ్యక్షుడిగా పడకంటి శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా కాసోజీ ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా అందె రాజశేఖర్, కోశాధికారిగా గాండ్లోజి నరేష్ బాబు, కార్యనిర్వాహక సభ్యుడిగా చిర్లవంచ సాయి కిరణ్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా పొన్నోజి ప్రభు, చిర్లవంచ మురళి, భూమయ్య, కాసోజీ రాములు, పురుషోత్తం, నాగేందర్, రమేష్, ప్రభాకర్, జగదీష్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పడకంటి శ్రీధర్ మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా కృషి చేస్తామని అన్నారు.నూతన కార్యవర్గాన్ని పలువురు సంఘ సభ్యులు అభినందించారు.

# నృత్య ప్రదర్శనలో కమాన్ పూర్ విద్యార్థిని కి అవార్డు.

**కమాన్ పూర్:సెప్టెంబర్ 13.(విజన్ ఆంధ్ర )**



కమాన్ పూర్ మండల కేంద్రం చెందిన తలారి శివాంషి డ్యాన్సులో తమ ప్రతిభ చూపి అవార్డును గెలుచుకున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన కళాకృతి వేదిక 20 26 రోజున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో జానపద సినీ కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించగా ఆ పోటీల్లో నిత్యం చేసి ఉత్తమ డ్యాన్సర్ గా ఎంపికైంది. ప్రముఖ గాస్ మాస్టర్ నేతృత్వంలో శిక్షణ పొందిన శివాంషీ గతంలో సైతం ఎన్నో అవార్డులను గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డ్యాన్స్ ఆర్గనైజర్ శ్రీదేవి, డాన్స్ మాస్టర్ పులిపాక దేవా, మ్యాజిక్ శశి, వీరుల ప్రశాంత్ త తదితరులు పాల్గొన్నారు. బహుమతి గెలుపొందిన శివాంషిని పలువురు అభినందించారు. మరిన్ని అవార్డులు గెలుపొందాలని డాన్సుల్లో రాణించాలని సూచించారు.

# ఆది వరాహ స్వామి వారి వద్దకు పోటెత్తిన భక్తులు.

**కమాన్ పూర్ సెప్టెంబర్ 13. (విజన్ ఆంధ్ర )**

కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ ఆది వరహాస్వామి ఆలయంలో ఆదివారం భారీ ఎత్తున భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం ముగియడంతో గణేష్ చతుర్థి కి ముందు భక్తులు హాజరయ్యారు. అలాగే సుల్తానాబాద్ పట్టణ మున్సిపల్ 14వ వార్డ్ కౌన్సిలర్ పద్మ అబ్బయ్య గౌడ్ కాంగ్రెస్ అబ్బయ్య గౌడ్ తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కోసన కాంతరెడ్డి ఆధ్వర్యంలో పూజలను చేయించారు. కౌన్సిలర్ తదితరులకు ఆలయం తరఫున సన్మానం చేసి స్వామివారి ప్రతిమను బహుకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తీగల రాజయ్య గౌడ్, పూస శ్రీనివాస్ గౌడ్, కొంతం శ్రీనివాస్, చాట్ల రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ నెల చివరలో సిరిసిల్ల లో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

**దళిత స్పీకర్ ను అవమాన పరిచిన బీ ఆర్ ఎస్**

**పసుపునీళ్ల తో శుద్ధి చేసి దళితుల ఆత్మగౌరవం తో చెలగాటం**

**కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గం ఇంచార్జ్ కే కే మహేందర్ రెడ్డి**



**గంభీరావుపేట సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ సెప్టెంబర్ చివరి వారంలోసిరిసిల్ల లో ఉంటున్నదని సిరిసిల్ల ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా సభ ఉంటున్నదని పెద్ద ఎత్తున అట్టి సభను ప్రజలు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గం ఇంచార్జ్ కే కే మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం గంభీర్ రావు పేట్ మండలం దమ్మన్నపేట గ్రామంలో పలు కార్యక్రమాలలో మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కే కే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీ ఆర్ ఎస్ ఎం ఎల్ ఏ లు వారి బండారం బయట పడుతున్నదనే అసెంబ్లీ కి రాకుండా కుట్రపూరితం గా వ్యవహరిస్తున్నారని కావాలనే కేసీఆర్ ఫామ్ హౌస్ ఆదేశాలతోఅసెంబ్లీ గేటు దగ్గర బూత్ పురాణం, దాడులకు ఎగబడి సస్పెన్షన్ చేయించుకున్నారని కే కే మహేందర్ రెడ్డి ఆరోపించారు,బీ ఆర్ ఎస్ ఎం ఎల్ ఏ లు నాయకులు దళిత స్పీకర్ ప్రసాద్ కుమార్ ను బూతులు తిట్టి అవమానపరిచారని, పసుపు నీళ్లు పోసి శుద్ధి చేసి దళితుల ఆత్మ గౌరవాన్ని కించపరిచారన్నారు,ఇనుప కంచెలను ఛేదించి ప్రజాస్వామ్య హక్కుల పునరుద్ధరించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు.అన్ని రకాల మాఫియాలను పెంచి పోషించి ధరణి పోర్టల్ పేరుతో రైతులను అరగొస పెట్టి మోసం చేసిన చరిత్ర కే సీ ఆర్,కే టీ ఆర్,హరీష్ రావు లకే దక్కుతున్నదన్నారు,నెలకు 6750 కోట్ల రూపాయల మిత్తి కట్టుకుంటూ రాష్ట్రాన్ని సంక్షేమ,అభివృద్ధి పథంలో ముందుకు సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లుతున్నారని మహేందర్ రెడ్డి అన్నారు,గూడు లేని పేదలకు సిరిసిల్ల నియోజక వర్గంలో 5500 ఇండ్లు మంజూరు చేశామని 15 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు,మహిళలకు 33%రిజర్వేషన్స్ కల్పిస్తున్నామని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం సీఎం రేవంత్ రెడ్డి అభిమతమన్నారు,బీసీ కులగణన,ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందన్నారు,స్థానిక ఎం ఎల్ ఏ కే టీ ఆర్ నియోజక వర్గం సమస్యలు పట్టించుకోకుండా వాటిని గాలికి వదిలేసి చిల్లర మల్లర గా మాట్లాడుతూ అధికారమే పరమావధిగా రాష్ట్రమంతా తిరుగుతున్నారని మహేందర్ రెడ్డి ఆరోపించారు,స్థానిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు పోవలసిన బాధ్యత కేటీఆర్ కు లేదా అని మహేందర్ రెడ్డి ప్రశ్నించారు, ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు,మండల మాజీ అధ్యక్షుడు హమీద్,నాయకులు రాజనర్సింహ రెడ్డి,బలరాం రెడ్డి,,అజీమ్,బాల్ రెడ్డి,భాస్కర్ నాయక్,విఠల్ నాయక్,సంతోష్,శ్రీనివాస్,రఘువీర ప్రసాద్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ

**పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత -వేములవాడ డి ఎస్పీ శ్రీనివాసులు**




**వేములవాడ సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర)**

వేములవాడ పట్టణంలో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వేములవాడ డి ఎస్పీ శ్రీనివాసులు, వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వేములవాడ రూరల్ ఎస్ ఈ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. వీరి చేతుల మీదుగా ప్రతిమలు అందించారు.ఈ సందర్భంగా డి ఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి అని నీరు ప్రతీ ప్రాణికి అత్యంత ఆవశ్యకం అని ప్లాస్టర్ అఫ్ పారిస్ వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుంది అని,గత కొన్ని సంవత్సరాలు గా మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంచటం జరుగుతుంది అని ఇటీవల ప్రజలకు అవగాహన పెరగడంతో క్రమంగా మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్టించేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు అని పర్యావరనాన్ని రక్షించే దిశగా యువ ఫౌండేషన్ ప్రయత్నం గొప్పది కొనియాడారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్ళుగా ఉచితంగానే మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాము అని, పర్యావరణాన్ని కాపాడుకోవటం ప్రతీ ఒక్కరి భాద్యత అని భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ఇప్పటి నుండి పిల్లలకు కాలుష్యం మీద అవగాహన కల్పించాలని, ప్రజలు వినాయక నవరాత్రులను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో ప్రకృతి ప్రకాష్, యువ ఫౌండేషన్ సభ్యులు దూలం రామ్ కుమార్, సాయి, రాహుల్ మరియు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో 'వాత్సల్య' పిల్లల ఆసుపత్రి ప్రారంభం



**జమ్మికుంట: సెప్టెంబర్ 13 ( విజన్ ఆంధ్ర).**

పట్టణ పరిధిలోని బొమ్మల గుడి శివాలయం ఎదురుగా డాక్టర్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాత్సల్య పిల్లల ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు చిన్నారులకు వైద్యం కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, ఇంద్రసేనారెడ్డి, పలువురు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాటమే:కమ్యూనిస్టులు.

**పోరాటం చేయని మతోన్మాదులకు మాట్లాడే అర్హత లేదు.**

**విలీనం దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి.**

**సెప్టెంబర్ 17 చరిత్ర, దాని ప్రాధాన్యత.**

**బోయినిపల్లి సెప్టెంబర్ 13 (విజన్ ఆంధ్ర):**

తెలంగాణలో 1946 సెప్టెంబర్ 11 నుండి 1951 అక్టోబర్ 21 వరకు, ఐదేళ్లపాటు వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగింది. ప్రపంచ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగిన పోరాటం అది. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ, ముస్లిం ప్రజల మధ్య మత ఘర్షణగా చిత్రీకరించింది బిజెపి, ఆర్ఎస్ఎస్,సెప్టెంబర్ 17న ప్రాధాన్యతను వక్రీకరించి ముస్లింల నుంచి హిందువుల విమోచనం దినంగా దృష్ప చారం చేస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలు ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట ప్రాధాన్యతను యువత ముందు ఉంచేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నాయి. దేశానికి స్వాతంత్రం వచ్చేనాటికి బ్రిటిష్ ఇండియాకు వెలుపల 565 సంస్థలు ఉన్నాయి. వీటిలో అతిపెద్ద రాజ్యం హైదరాబాద్ సంస్థానం. నిజాం రాజు, మీరు ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలిస్తున్నాడు. తెలంగాణతో పాటు, ప్రస్తుత కర్ణాటక, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాలు ఆనాడు హైదరాబాద్ రాజ్యంలో భాగంగా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగింది. సాయుధ రైతాంగ పోరాటం, గ్రామాల్లో భూస్వాములు, జమీందార్లు, దేశముఖ్, జాగిర్ దారులు,దోపిడీఅణిచివేతకు వ్యతిరేకంగా సాగిన పోరాటమిది.

ఆ రోజుల్లో తెలంగాణ ప్రాంతంలో గ్రామీణ ప్రజలంతా భూస్వాములకు వెట్టి చాకిరి చేసే పరిస్థితి, భూస్వాముల భూమి దున్నిన తర్వాతనే సొంత భూమి సాగు చేసుకునే పరిస్థితి, అనుకూల సమయంలో భూస్వాముల భూమి దున్ని, విత్తనాలు వేసి ,నాట్లు నాటి ,ఆ తర్వాత తమ భూమిలో అడుగు పెట్టాలి, అప్పటికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండేవి కావు ఫలితంగా తమ భూమిలో తగినంత పంట ఉండేది కాదు. తమ కట్టవలసిన పన్నులు పోగా తినడానికి మిగిలేది కాదు. భూస్వామికి అప్పుల పాలయ్యేవారు. దీనితో వెట్టి చాకిరి చేయవలసింది వచ్చేది. కమ్మరి, కుమ్మరి, మేదరి వంటి వృత్తిదారులు తమ ఉత్పత్తులు ఉచితంగా ఇవ్వాలి. గొర్రెలు, మేకలు వంటివి కూడా ఉచితంగా ఇవ్వవలసిందే. మరోవైపు ప్రభుత్వానికి గొర్రెలు, మేకలు, బర్రెలు, ఎడ్లు అన్న తేడా లేకుండా అన్నింటికీ పన్నులు చెల్లించే పరిస్థితి దాపురించింది ఆ రోజుల్లో. ఇలా ఎట్టి చాకిరికి జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగపోరాటాన్ని ఈరోజు అధికారంలో ఉన్న కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం, హిందువుల, ముస్లింల పంచాయతీగా చిత్రీకరించి అధికార రాజకీయ లబ్ధి కోసం ప్రజలను, యువతను పక్కదారి పట్టిస్తూ తన రాజకీయ పబ్బం గడుపుకుంటుంది.ఈ కార్యక్రమం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలోసిపిఎం మండల కన్వీనర్, గురజాల శ్రీధర్, ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రామంచ అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కుడుకల గిరిబాబు, రామంచ ప్రభాకర్, గోల్కొండ దేవయ్య, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

